# సింగిల్ పేజీ కథలు

## ఆస్తి

క్లోజ్ ఫ్రెండ్ శంకర్రావు బావ మరిదికి పెళ్లిచూపులట...రమ్మని పిలిచాడు.

నేను మితాహారినే కాదు మితభాషిని కూడా. ఎక్కువగా మాట్లాడలేను సరికదా పదిమందిలో అస్సలు నోరు కూడా విప్పలేను. అయినా పిలిచాడు...చెప్పాను కదా క్లోజ్ ఫ్రెండ్‌నని.

మధ్యవర్తి, అమ్మాయి కాస్త బొద్దుగా ఉంటుందని చెప్పాట్ట. ఆ ఊరెళ్లి అమ్మాయిని చూశాము. బొద్దుగా కాదు ఓ పాలెక్కువగానే ఉంది. చామనచాయలో ముఖం కళగానే ఉంది. ఇహపోతే అమ్మాయి దివ్యంగా ఉద్యోగం చేస్తోంది...అదీ స్టేట్ గవర్నమెంట్‌ది. అది ఆ అమ్మాయిలోని మొట్టమొదటి ప్లస్ పాయింట్.

శంకర్రావుకి మావగారు లేరు. అల్లుడి సాయంతో అత్తగారే పెళ్లి సంబంధాలు చూస్తోంది. పిల్లలో రూప పరంగా అసంతృప్తి కలిగినా, క్యాష్ పరంగా అన్నీ కవరయిపోతాయని మధ్యవర్తి ద్వారా విశ్వసనీయంగా తెలిసిన విషయం. 'మనీ' ఉంటే చాలు అన్నీ 'మేనేజ్' చెయ్యొచ్చునేది ఈ కాలానికి సరిగ్గా సరిపోతుంది.

పూర్తి ఇష్టంతో అవుననలేకపోతున్నారు. అసంతృప్తితో కాదనలేకపోతున్నారు. డోలాయమాన స్థితిలో...అర్థం కాని రీతిలో నిలువుగానూ...అడ్డంగానూ ఊపి- రెడ్డో...గ్రీనో తెలియని సిగ్నలిచ్చారు.

ఆ సిగ్నల్ కోడ్‌ని...డీకోడ్ చేసి...కలరింగిచ్చి...మీ అమ్మాయంటే పడి ఛస్తున్నారని చెప్పాడో ఏమో! ఒక మంచి రోజు చూసి ఫోన్ చేసి వచ్చారు.

శంకర్రావు మళ్లీ నన్ను పిలిచాడు. అక్కడ నేను ఉత్సవ విగ్రహాన్నే అయినా వాడికదో తృప్తి. ఫార్మాల్టీ కోసం వెళ్లాను.

అయిష్టాన్ని ఇష్టంగా...అసంతృప్తిని తృప్తిగా మార్చే పవర్ 'మనీ'కుంది మరి. ముగ్గురు మగపిల్లల తరువాత పుట్టిన ఆడపిల్ల అవ్వటం వల్ల కట్నం కూడా భారీగానే ఇస్తామన్నారు. మగపిల్లలతో సమానంగా ఇంట్లో వాటా...పది సవర్ల బంగారం...లక్ష క్యాష్...అలక పాన్పు మీద అల్లుడికి మోటారు సైకిల్.

ఆ ఆఫర్‌కి నా నోరు తెరుచుకోవటమే కాదు.. ఆశ్చర్యంతో కళ్లు పెద్దవయ్యాయి. ఆ స్థితి నుండి బయట పడకముందే శంకర్రావు అత్తగారు షాకిచ్చింది. ఇర్వై సవర్ల బంగారం...మూడు లక్షల క్యాష్ అడిగింది.



''దీసీజ్ టూ మచ్!'' నా అంతరాత్మ అరుస్తోంది. ఒక విషయం ఇంతవరకు మీతో చెప్పలేదు, అబ్బాయి నిరుద్యోగి. ''దీసీజ్ టూ మచ్!'' మీరూ అదే మాట అంటున్నారా! మీరు ఆ మాటంటారని నాకు తెలుసండి.

అన్‌ఎంప్లాయిని పిలిచి పిల్లనివ్వటమే చాలా గొప్ప విషయం. దానికి తోడు ఉద్యోగస్తురాలు...ఇంట్లో సమాన వాటా... బంగారం...క్యాష్...మోటారుసైకిల్. ఓ గాడ్! ఈ దేశపు...ముఖ్యంగా తెలుగు రాష్ట్రం ఆడపిల్లల్ని నీవే కాపాడాలి!

మనసు ఎంతగా గోల చేస్తున్నా...చెప్పాను కదా! విగ్రహంలా మాటా పలుకు లేకుండా అలానే కూర్చున్నాను. నోరు విప్పని ముంగి మోహానివి...మూగమొద్దువి నువ్వేం పెళ్లి పెద్దవి అని మాత్రమే కాక మీ మనసులో బండబూతులు కూడా తిడుతూ ఉంటారు. కానీ ఏం చేయను నా పరిస్థితి అటువంటిది.

పెళ్లిళ్లు స్వర్గంలో నిర్ణయమై భూమ్మీద జరుగుతాయంటారు. నిర్ణయాన్ని...పెళ్లిని కూడా 'మనీ' జరిపిస్తోందని ...మనిషిని శాసిస్తోందని స్పష్టంగా తెలుస్తోంది. అయినా మనం నిజాన్ని ఒప్పుకోని పిరికివాళ్లం. ఆ దేవుడి చేతిలో కీలుబొమ్మలం...ఆడుతున్నాం అంటాం.

శంకర్రావుకి...వాళ్లావిడికి కూడా సుభద్రమ్మ మాటలు రుచించలేదు కాబోలు. వాళ్లవి సేమ్ ఫీలింగ్స్ అయ్యుంటాయి మొహాలు అదోలా పెట్టుకొని కుర్చీల్లో అనీజీగా కదులుతున్నారు.

అప్పుడు అక్కడి వాతావరణం వేడి వేడిగా ఉన్నట్టనిపించింది. కానీ నిశ్శబ్దంగా ఉంది. పెళ్లికూతురి వైపు వాళ్ల మొహాలు ఊహించని ఆ షాక్- కుమ్ములో వంకాయల్లా అయిపోయాయి. పాపం వాళ్లని చూస్తోంటే నాకు జాలేసింది.

''అమ్మా! సుభద్రమ్మ గారూ...ఇంకో మాట చెప్పండి! ఇది ఒక ఆడపిల్ల జీవితానికి సంబంధించిన విషయం...బాగా ఆలోచించుకొని సెలవీయండి!'' ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొని వినమ్రంగా వినిపించాయి మధ్యవర్తి మాటలు.

''ఇదేమయినా కూరగాయల బేరమటయ్యా! ఇంకో మాట ఇంకో మాట చెప్పటానికి. పాతికేళ్లు పెంచిన వాళ్లే వదిలించుకోటానికి అంత గట్టిగా పట్టుపడితే...నూరేళ్లు భరించాల్సిన వాళ్లం'' కాస్త కోపంగా అంది సుభద్రమ్మ.

పిల్ల తండ్రి కలుగజేసుకున్నాడు.

''అది కాదు అక్కయ్యగారూ! పెళ్లితోనే అంతా అయిపోదు కదా! పండుగలు...పబ్బాలు...బహువంతులు...కానుకలు...ముచ్చట్లు ఇంకా ఎన్నో ఉంటాయి. రెండు లక్షలు...పదిహేను సవర్లు ఇచ్చుకుంటాను (ఆడపిల్లను కన్నందుకు ఈ జరిమానా ఎవరు విధిస్తున్నారు భగవంతుడా! కాదు...కాదు ముమ్మాటికి కాదు. స్వార్థం కప్పేసిన మనుషులు ఏర్పాటు చేసుకున్న సమాజం ఏర్పాటు చేసిన పెద్ద (దు)రాచారం) ఇహ మీరు కాదనకండి!'' బతి

మాలుతున్నట్టుంది పిల్ల తండ్రి ధోరణి.

పిల్ల కాస్త లావు వల్ల వయసుకి మించి కనిపిస్తోంది. ఆయన ఎంత విసిగిపోయాడో ఏమో! ఉద్యోగం లేని వరుడికైనా కట్నం ఎక్కువ ఇచ్చి అయినా కూతురి పెళ్లి చేసెయ్యాలన్న గట్టి నిర్ణయం కనిపిస్తోంది.

పిల్ల మనస్ఫూర్తిగా నచ్చలేదు. నచ్చనిదాన్ని నచ్చినట్టు చేయాలంటే కావల్సినంత కట్నం డిమాండ్ చేసి రాబట్టాలని పంతంగా ఉన్న సుభద్రమ్మ ససేమిరా అంటుంది. నేను నోరు విప్పి ఒక్కమాట మాట్లాడలేకపోయిన వాళ్ల వాళ్ల ఫీలింగ్స్‌ని మాత్రం కచ్చితంగా కనిపెట్టేస్తున్నాను.

అంతా విన్న మధ్యవర్తి ఏమనుకున్నాడో ఏమో! మా అందర్నీ లోపలకి పిలిచాడు.

''సుభద్రమ్మగారూ! అయ్యా శంకర్రావుగారూ! ఇలా అంటున్నందుకు ఏమీ అనుకోకండి. అమ్మాయి కాస్త లావు ఒప్పుకున్నాను. అందుకోసమే మీరు కాస్తా పెదవి విరుస్తున్నారన్న సంగతి నాకు తెలుసు. అమ్మాయి గుమ్మడి పండులా ఉండబట్టే కదా ఉద్యోగం లేని మీ అబ్బాయి కోసం ఇంత దూరం రావటం. పిల్ల మెరుపుతీగే అయితే మీ స్థితికి మీ వైపు కన్నెత్తి కూడా చూసేవారు కాదు. మీ అబ్బాయికి ఉద్యోగం లేదు సరి కదా...కనీసం సొంత ఇల్లు లేదు...వెనుక ఆస్తి కూడా లేదు. వారు సంతోషంగా ఇచ్చిన దానికి సం...తృ...ప్తి'' ఆయన మాట పూర్తి కాలేదు.

గయ్యిమంది సుభద్రమ్మ. ''ఉద్యోగం లేదన్న విషయం వేలెత్తి చూపించనవసరం లేదు. అది తెలిసే మీరు వచ్చారు. ఇహ ఆస్తి దాని వివరాలు అంటావా? వేరే ఆస్తి ఎందుకు? లక్షలు కోట్లు విలువ చేసే మగబిడ్డని కనటమే గొప్ప ఆస్తి. మగాడికి ఉద్యోగం లేకపోయినా...ఆస్తి లేకపోయినా వాడి విలువ తగ్గదు. ఆ విలువ ఉండబట్టే కదా పిల్లతో పాటు కట్నం ఇస్తామని వచ్చారు'' ఇంకా ఆమె చేతులు తిప్పుతూ ఏమేమో అంటోంది.

ఆడపిల్లని కనటం అంత పాపమా? లేక నేరమా? ఆడపిల్లని కన్నవాళ్ల పరిస్థితి ఇంత అధ్వానమా? ఇంత దయనీయమా? ఆడజన్మ అంత నీచమా? నా చెవులు...మెదడు కూడా పనిచేయటం మానేశాయి. రేపు నా బిడ్డల పరిస్థితేంటి? అప్పుడే టీనేజ్‌లోకి ఎంటరయిన ముగ్గురు కూతుళ్లూ నా కళ్ల ముందు సినిమా రీల్‌లా గిర్రున తిరుగుతున్నారు.

**-కె. విజయలక్ష్మి (బాపట్ల)**

# అసలు నిజం

ట్రాన్స్‌ఫర్‌ల కోసం ఉపాధ్యాయులకు నిర్వహించే కౌన్సిలింగ్‌లో ఎట్టకేలకు చివరికి తాను కోరుకున్న ఊరు లభించడంతో ఎంతో ఆనందించింది రాధ. ఇన్నాళ్లుగా తన వారికి దూరంగా ఒంటరిగా ఉండి ఎంతో బాధకు గురయిన రాధకు కౌన్సిలింగ్ పుణ్యమాని కోరుకున్న ప్రదేశం దొరకడంతో ఇక ఓ ఐదారు సంవత్సరాల వరకు ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉండొచ్చనే ఆలోచన ఎంతో ఊరటను కలిగించింది.

అలా ఒక రోజున పనిచేసే పాఠశాల నుండి రిలీవై వెళ్లి కొత్త పాఠశాలలో జాయిన్ అయింది రాధ. సహజంగా ఎక్కడయినా ఉపాధ్యాయులు ఆప్యాయంగా, స్నేహంగానే ఉంటారు. దానికి తోడు రాధది కూడా సరళ స్వభావమే కనుక కొత్తనేది లేకుండా త్వరలోనే ఆ వాతావరణానికి అలవాటు పడిపోయింది రాధ. ఎవరూ వేలెత్తి చూపకుండా తన పని తాను చేసుకుని పోయే రాధ ఎవరికేం పని కావాలన్నా కాదు రాదు అనకుండా ఎంతో ఓపిగ్గా సంతోషంగా చేసి పేర్చేది. ఆఫీస్ పని సొంతంగా రాకపోయినా అవీ ఇవీ రాయడం కూడా శ్రమనుకోకుండా చేసేది.

అయితే ఆ పాఠశాల ఆఫీసులో పనిచేసే క్లర్క్‌కు అంతగా పనిచేయడం రాదనే విషయం ఓ నాలుగు రోజుల్లోనే తెలిసిపోయింది రాధకు. కానీ అతనికి పని రాకపోయినా అక్కడ పనిచేసే టీచర్లలో ఒకరు సహాయం చేసేవారు. అతని పనంతా ఆయనే చూసేవాడు. ఇక క్లర్క్ ఏ పని చేయకుండా కనీసం నేర్చుకునే ప్రయత్నం చేయకుండా ఊరికే కూర్చొని ఉండిపోయేవాడు. అది చూసిన రాధకు అబ్బా! ఎంత మంచితనం తోటి వ్యక్తికి పని



రాకపోయినా అతన్ని కూర్చోబెట్టి సమస్త పనులు తానొక్కడే చేసుకోవడం ఎంత గొప్ప అంటూ మనసులో ఎంతగానో ఆ టీచర్‌ను అభినందించుకునేది. అలా కొన్ని రోజులు గడచిపోయాయి. అప్పుడు తెలిసింది అసలైన నిజం క్లర్క్‌కు తోటి మనిషిగా సహాయం చేయడం లేదని. అందుకోసం అతడి నుండి ప్రతి నెలా కొంత డబ్బు ఇప్పించుకొని దానితో ఫోన్, కరెంటు బిల్లులు చెల్లిస్తారని, ఆ సహాయం చేసే వ్యక్తే ఎక్కువగా ఫోన్‌ను ఉపయోగించుకుంటాడని, అందుకే సహాయం చేస్తున్నాడని తెలియడంతో ఔరా అదన్న మాట అసలు సంగతి. ఎదుటివారి నుండి లాభం లేకుండా ఎవరూ అయాచితంగా సహాయం చేయరని మొదట తను ఊహించింది తప్పని అనుకున్నది రాధ. అంతేకాదు అతనికొచ్చే తక్కువ జీతంలో పని రానందుకు కొంత పోగొట్టుకోగా మిగిలింది ఎలా సరిపోతుందో. కనీసం ఇప్పటికైనా పని నేర్చుకుంటే బాగుంటుందిగా అని చేసేదేం లేక మనసులోనే జాలిగా నిట్టూర్చింది రాధ.

**-ఎస్.కె. దుర్గ (క్యాతూరు)**